మశకాయణం

కొడవటిగంటి కుటుంబరావు

విక్రమ శకం, శాలివాహన శకం, క్రీస్తు శకం-వీటన్నిటికన్న ప్రాచీన మైనది మశకం. ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్రులు చెప్పబడి ఉన్నందునే మనం చంకలు గుద్దుకుని "అబ్బో మనం చాలా పాత కాలపు మనుషులం'' అని విర్రవీగుతున్నాం. కాని దోమలు ఋగ్వేదంలోనేచెప్పబడి ఉన్నాయి. (నేను ఋగ్వేదం చూశానని కాదు; చూడటమేమిటి? చదివినా అది నాకు అర్థం కాదు. విమానాల దగ్గిరనుంచిఉన్న వేదాలలోదోమల ప్రసక్తి లేక పోయిందా అని!) అనార్యమైన శాస్త్ర దృష్టితో చూచినా మనిషి అనే కీటకం కన్న ముందు పుట్టినది మశకమనే కీటకం.

అరణ్య వాసాలు చేసిన హరిశ్చంద్రుడూ నలుడూ, రామ లక్ష్మణులూ, పాండవులూ మొదలైన ప్రాచీనులు దుర్భరమైన దోమలబాధ అనుభవించి ఉండాలి, కాని ఈ విషయం ఎవరూ బయట పెట్టలేదు. ఎప్పుడూఅడవుల్లోనేఉండేమునీశ్వరులుదోమలబాధ పడలేకనేగడ్డాలూ మీసాలూ పెంచేసుకున్నారు. ఋష్యాశ్రమాలలో వటువులకు మాత్రమే దోమల బాధ ఉండేది. తపోధనంతోబాటు కేశసంపదకూడా అలవరుచుకున్న ఋషి పుంగవులు, దోమలు తమకేసి వచ్చినప్పుడు "అహ్హహ్హ!'' అనేవాళ్ళు.

అరణ్యాలలోనే గాక అయోధ్య, హస్తినాపురం, ఇంద్రప్రస్థం, మిధిలా, మొదలైన పురాణ నగరాలలో కూడా దోమలుండేవని నా నమ్మకం. ఈ విషయాన్ని కూడా పురాణాలు రాసినవారు దాచిపెట్టారు, మొత్తానికి, నన్నడిగితే, ప్రాచీన కాలపు కవులకన్న ఋషులే దోమల విషయంలో ఎక్కువ నిజాయితీ కనబరిచారు, "పిపీలికాది బ్రహ్మపర్యంతం'' అన్నారు ఋషులు, పిపీలిక అంటే నిఘంటువుల్లో ఏం అర్థం చెబుతున్నారో తెలీదుగాని, అసలైన అర్థం దోమే, మరి కవులేమన్నారూ, "హస్తిమశకాంతరం'' అన్నారు. వాళ్ళకి దోమలు కనిపించినపుడెల్లా ఏనుగులు జ్ఞాపకం వచ్చేవి కాబోలు! "మహా గజాః పలాయంతే మశకానాంతు కాగతిః?'' అన్నారు.

ఇలా వాళ్ళకి దోమతోబాటు ఏనుగులు ఎందుకు జ్ఞాపకం వస్తాయా అని నేను సైకో ఎనలైజు చేసి చూస్తే అందుకు కారణం వారికి దోమలంటే గల భీతేనని తేలిపోయింది. నిజానికి ఆ కవులు దోమను చిన్నచూపు చూడవలసిన అవసరం ఎంత మాత్రమూలేదు. మానవులు ఏనుగులను మచ్చిక చేశారు. వాటిని అదుపులో ఉంచ డానికి అంకుశాలు కనిపెట్టారు. వాటిమీద ఎక్కి సవారీ అయారు. ఒక్క దోమను మచ్చిక చేశారా? దోమలు మనం చెప్పినట్టు వినేందుకు ఒక్క సాధనమైనా కని పెట్టారా? ఏనుగు మీద సవారీ చెయ్యవచ్చు



నన్నది మనుషులు గ్రహించింది దోమల నుంచి కాదా? అవి సృష్ట్యాది నుంచీ ఏను గుల మీద సవారీ చేస్తూనే ఉన్నాయి. పట్టు మని పది దోమలు తగులుకుని కుట్టడం మొదలు పెడితే ఐరావతం లాటిది వెర్రెత్తి లోకం మీద పడేది! వెర్రెత్తిన ఏనుగు లను శంకరా రాగంతో దారికి తేవచ్చు (చూడుము "తాన్‌సేన్"). కాని దోమలను నిగ్రహించడానికి అటు హిందూస్తానీలో గాని, ఇటు కర్నాటకంలోగాని ఒక్క రాగం కూడా లేదు.! ఎందుకుంటుంది? వుండటానికి వీల్లేదు. ఏనుగులంటే వాటికి పురాతన ఓటమి అంటూ ఉన్నది. మనం ఏనుగ ఎదట నిలబడి శంకరా రాగం పాడడం ప్రారంభించిన కాస్సేపటికి అది ఆరోహణా వరోహణలను అంచనా కట్టి "అది శంకరా రాగమా ఏమిటి చెప్మా!'' అనుకుంటుంది. అనుకోగానే శంకరుడు జ్ఞాపకం వచ్చే



స్తాడు. ఆ స్ట్రీమ్ ఆఫ్ కాన్షస్‌నెస్‌లో శంక రుడు తమ పూర్వీకుణ్ణి చంపేసిన చరిత్ర ఘట్టం కొట్టుకు వస్తుంది. దాంతో అంత పెద్ద ఏనుగూ చల్లబడి చలిమిడిముద్దలా అయి పోతుంది. ఇటువంటిది దోమలవిషయంలో ఎంత మాత్రమూ సాధ్యంకాదు. వేదాల్లో గాని, పురాణేతిహాసాల్లోగాని ఒకగొప్ప దోమాసురుణ్ణి చంపిన వాడెవడూలేడు. జంబూ ద్వీపంలోనే కాదు, సప్త ద్వీపా ల్లోనూ లేడు. అదీగాక దోమకి స్వరజ్ఞా నమూ అవీ ఉన్నట్టు రుజువు కాలేదు. హిస్ట రీలో కూడా దోమ సున్నా మార్కు తెచ్చు కుంటుందనే మనం అనుకోవచ్చు. హిస్టరీ రాకపోవడం దోమకి మహా బలమిచ్చింది- పురాణాల్లో ఏముందో తెలీకపోవడం సనాతన వాదులకు బలమిచ్చినట్టు దోమలకు చరిత్ర నుంచి నేర్చుకునే దేమీలేదు. వాటికి సృష్టి రహస్యమే తెలుసు. మానవ జాతిలో సగం చచ్చిపోతుందన్నా మనం తారెత్తి పోతాం;

యుద్ధాలు వద్దు మొర్రో అంటాం; అణువు బాంబులు మొదలుకుని పెనిసిళ్ళు చెక్కుకునే చాకులు దాకా అన్నీ నిషేధించ మంటాం. వాటికి లక్ష్యం లేదు. భూమ్మీద ఉండే దోమలన్నీ చచ్చినా పరవాలేదు. ఒక్క ఆడదోమ ఒక్క మగదోమ మిగిలితే చాలు— కొల్లేటినీ, కొడంబాకాన్ని, విజయనగరాన్ని, విశాఖపట్టాన్నీ — అవలీలగా తమజాతితో నింపెయ్య గలవు. ఈ సంగతి ప్రతి పిల్లదోమకీ తెలుసు.

బతకటం చాతకాదు, మనం చావుకి భయపడతాం, ఏ రష్యాలోనో చచ్చినవాళ్ళని కూడా కొందరిని బతికిస్తున్నారట, ఫలానా ప్రమాదకరమైన రోగాలకి మందు కనిపెట్టారట అంటూ మనం చంకలు గుద్దుకుంటాం. ఈ విధంగా విజ్ఞానంతో చావు నుంచి తప్పించుకుంటున్న ప్రతి ఒక్క ప్రాణికీ కనీసం ఓ వెయ్యిమంది కార్లకింద పడి చస్తున్నారు. పారిశ్రామిక ప్రమాదాల్లో చస్తున్నారు, ఆకలికి మాడి చస్తున్నారు. వీటికి విరుగుడు కనిపెట్ట లేనందుకు మనకి సిగ్గ

యినా లేదు. దోమలు మటుకు చావును లక్ష్యపెట్టవు. ఒక్కచుక్క రక్తంకోసం అవి ప్రాణా లొడ్డుతాయి. వాటికి ఘనంగా బతకటమే ముఖ్యం.

నిజంగా అవి ఘనంగానే బతుకుతాయి. నేను వాటి జీవితం గురించీ, అద్భుత శక్తులను గురించీ చాలా రకాల పరిశోధనలను చేసి ఉన్నాను. నా పరిశోధనల ఫలితాలను నాస్తికులూ, అనార్యులూ అయిన శాస్త్రజ్ఞులు ఒప్పకపోతే అది నా తప్పుకాదు.

ఇతర ప్రాణుల లాగా కాదు, దోమలకు ఆహారం ఉండి తీరాలనే నిర్బంధం ఏమీ లేదు. మనం ఓ వారంరోజులపాటు ఇల్లు తాళంపెట్టిపోతే దోమలు ఖాతరు చెయ్యవు. అవి మన రక్తం తాగటం అవసరం కొద్ది కాదు; సగం మనమీద వాటి ఆధిక్యత నిరూపించటానికీ, సగం నిషాకోసమూనూ.



మాదీ ద్రవ్యాలు మనకు ఆనందం చేకూర్చేది మెదడును మొద్దు బార్చి—ఈ సంగతి అందరికీ తెలుసు. దోమలు స్వతహాగా మనకన్న తెలివితేటలు గలవి, అందుచేత, మన రక్తం తాగటంచేత వాటికి తాత్కాలికంగా మెదడు మొద్దు బారుతుంది. అప్పుడు వాటికి నిషా వస్తుంది. రక్తం బాగా తాగి కైపెక్కి తూలుతూ నృత్యాలు చేస్తూ, ఎగిరేటప్పుడు పల్లటీలు కొట్టే దోమలను నేను కళ్ళారా చూశాను.

వాటి తెలివి తేటలను గురించి శంకించే వాళ్ళు పరమ నాస్తికులని నా దృఢ విశ్వాసం. మనం ఎప్పుడు బొత్తిగా అన

హాయ స్థితిలో ఉంటామో వాటికి తెలుసు. మనసీ మన అలవాట్లనూ, మన అశక్తతనూ అవి కాచి వడగట్టాయంటే అందులో అతిశయోక్తి ఏమీలేదు. మన రెండు చేతులూ పని మీద ఉన్న సమయంచూసి అవి యథేచ్ఛగా మనని కుడతాయి. రాసుకునేటప్పుడు కలం

పట్టుకున్న చేతిమీద దోమవాలి నన్ను వెక్కిరించటం అనేకసార్లు జరిగింది. నేను చల్లగా కలం జారవిడిచే సమయానికి దోమలేచి పోతుంది. నాబోటి చతుర్నేత్రుల సంగతి దోమకు తెలుసు. అది కళ్ళజోడు బద్దీకీ కణతకూ మధ్య చేరి నిశ్చింతగా రక్తపానం చేస్తుంది. దాన్ని కొట్టాలంటే కళ్ళజోడుకు ప్రమాదం. మళ్ళీ మనం నలభై రూపాయలు పోసి కళ్ళజోడు కొనుక్కోలేమని దానికి తెలుసు!

దోమ మన చాయలకు వచ్చినప్పుడల్లా కుట్టటానికే వచ్చిందనుకో నవసరంలేదు. మనకు వాటిపై శత్రుత్వం ఉండి, అవి కనిపిస్తేనే తిక్కరేగే మనస్తత్వం ఉన్నప్పుడు మనపని పాడు చెయ్యటానికీ, మనని పీడించటానికీ అని మన ముందు ఆడతాయి. మనం వాటిని కొట్టటానికి యత్నిస్తే ఏదో గట్టి వస్తువు చాటుకి పోతాయి—మన చేతికి చచ్చే

దెబ్బ తగులుతుంది. దోమలను కొట్టటానికి యత్నించేవాళ్ళు సిరాబుడ్లూ, సిగిరెట్టుపీకలు వేసే ట్రేలు పడగొట్టటం జగద్విదితం. దోమలు నిజమైన దివ్య దృష్టితో మనం చేసే పనులన్నీ గమనించి అర్థం చేసుకోవటమే గాక చేయబోయే పనులు కూడా సరిగా ఊహిస్తాయి.

ఏకారణం చేతనో ఇంకా నేను పరిశోధించ లేదు. ఈ రహస్యం కనుక్కున్నాక పద్మశ్రీ బిరుదుకు అర్జీపెట్టు కుందామను కుంటున్నాను. దోమలకు మగవారి మీద ఎక్కువ పగ. అవి ఆడవాళ్ళ నెత్తి మీద సుమారు రెండుమూడు అంగుళాల ఎత్తున, ఎగురుతూ ఉంటాయి, కాని కుట్టవు. వాళ్ళ తలలోనుంచి వచ్చే సువాసన వాటికి నిషా

యిస్తుందా? లేక వాళ్ళ మొగుళ్ళను కవ్వించ టానికి అవి అలా చేస్తాయా? ఇంకా తెలియ లేదు. తెలియగానే అంతర్జాతీయ శాస్త్ర సమ్మేళనానికి పంపించేస్తాను.

మనిషికి లేని మహత్తరశక్తులన్నీ దోమ లకున్నట్టు నేను రుజువు చేసుకున్నాను. ప్రాచీన మహర్షులలాగా అవి వాయు భక్షణ చేస్తాయి. యోగాభ్యాసాలు చేసేవారు ఎన్నె న్ని ఆసనాలు వేస్తారో అంతకి రెట్టింపు అవీ చేస్తాయి. అందుచేత వాటికి గరిమ, లఘిమ వగైరా అష్టసిద్ధులూ ఉన్నాయని నా నమ్మకం. అవి తేలుకుట్టినంత బాధ కలి గించగలవు, ఎప్పుడు మన రక్తం తాగినదీ తెలియరాకుండా, దద్దురెక్కిన తరువాత మాత్రమే తెలిసేలాగు కూడా కుట్టగలవు. ఎగురుతూ ఎగురుతూ అకస్మాత్తుగా 90 డిగ్రీలూ 180 డిగ్రీలూ కూడా మళ్ళగలవు. మన విమానాలలో ఈ ఫీటు చెయ్యగలవి ఉన్నాయా అని నేను అడుగుతున్నాను. ఇంత కంటే గొప్పవిశేష మేమంటే అలవోగ్గా ఎగిరిపోయే దోమ, నేను తనను గమనిస్తు న్నానని తెలిసి, అదృశ్యం కావటం నేను లక్షసార్లు చూశాను. [ఒకటి రెండు తక్కు వసార్లే చూసి ఉంటానను కోండి నిక్క చ్చిగా చెప్పాలంటే!] అదే విధంగా చేతిలో చిక్కిఅదృశ్యమైన దోమలుకూడా ఉన్నాయి.

దోమలు మనకు చిక్కనే చిక్కవనీ మనం వాటిని చంపలేమని నేననను. కాని అవి చావదలుచుకున్నప్పుడే మనకి చిక్కు తాయా అని నా అనుమానం. ఒక రోజు నేను రాసుకుంటుంటే ఒకదోమ వచ్చి కాగి తాలమీద వాలింది. ఆలోచన పాడు చేసుకో వటం ఇష్టంలేక తోలేశాను. పోయి మళ్ళీ వచ్చింది, మళ్ళీ తోలాను. "నన్ను చంపరా బాబు!" అన్నట్టు అయిదారు సార్లు వచ్చి అక్కడే వాలింది. ఆఖరుకు చంపి దాని కోరిక తీర్చాను, ఉత్తమ లోకాలకే వెళ్ళి ఉంటుంది. భగవద్గీతలో శ్రీ కృష్ణ పర మాత్మ స్థితప్రజ్ఞుణ్ణి గురించి ఏమన్నాడు, మనం నిద్రపోయే టప్పుడు వాడు మేలుకుం టాట్ట. మనం మేలుకున్నప్పుడు వాడు నిద్ర పోతాట్ట. దోమలకున్న స్థిత ప్రజ్ఞత్వం గురించి ఇంకా మనకి సందేహమెందుకూ?

దోమలని నిర్మూలించటానికి మందులు కనిపెడుతున్నారు, కనిపెట్టామని కూడా అంటున్నారు. అజ్ఞానం! కర్తీలేని అజ్ఞానం! డి. డి. టి. తీసుకోకండి. [నిజంగా తీసు కోకండి. పెద్దవిషం. దాన్ని అరవ భాషలో టి. టి. టి. అనిరాసి టి. డి. డి. అని చద వాలి. నేషనల్ ఇంటిగ్రేషన్ దృష్టిలో పెట్టుకుని ఆమాట రాశాను గాని, అరవ భాషకీ దోమల ప్రసక్తికీ సంబంధం ఉందని కాదు] ఈ డి. డి. టి. [లేక టి. డి.డి.]



కొట్టితే కొన్నిదోమలు చచ్చేమాట నిజమే అయితే, వెనకటి కో రాక్షసుడి రక్త బిందువు పడ్డ చోటనల్లా రాక్షసులు పుట్టుకు కొచ్చేవారట! అవిధంగా టి. టి. టి. [లేక టి. డి. డి.] కొట్టిన మర్నాడు ఇంటో రెట్టింపు దోమలుంటాయి, అంచేత ఈ టీ. డి. డి. [కాకపోతే డి. డి. డి.] యుద్ధ వార్తల్లోలాగా, ఇంతమంది శత్రువులను

చంపామని చెప్పటానికి పనికొస్తుందే గాని, అంతిమ విజయం చేకూర్చే సాధనం మటుకు కాదు,

పోతే, దోమ తెరలున్నాయి. ఇవి కృత యుగం నుంచీ మనకున్నాయి. [చూడుము పౌరాణిక చిత్రాలు] దోమతెరలు కట్టుకున్నంత మాత్రంచేత దోమలు కుట్టకుండా పోతాయను కోవటం భ్రమ. అరవంలో హిట్టయిన చిత్రాలు తెలుగులో డబ్ చేస్తే హిట్టవుతాయను కోవడంలాటిది. కడుపుతో వున్నమ్మ కనక మానదన్నట్టు దోమతెరలో దూరినవాడు బయటకు రాకుండా ఉండడు. అప్పుడు దోమలు వాడిచేత భరతం పట్టిస్తాయి. దోమలు కుడితే నిద్ర బొత్తిగా పట్టని వాళ్ళకి దోమతెర నిద్రమాత్రల్లే ఉపయోగించవచ్చు. కాని అందులోనూ ఒక పేచీఉంది. చాలామందికి దోమతెరలో పడుకోవడం చాతకాదు. చెయ్యిగాని, కాలుగాని చెంపగాని, చివరకు అరికాలైనా సరే దోమ తెరకు ఆనిందో, అలాటి అవకాశం కోసం



చూస్తున్న దోమలు రాజకీయ బేతాళకథలు చదివినట్టుగా విరగబడి నవ్వి తుగిడీలు తుగిడీలుగా వచ్చి రక్తపానం చేసేస్తాయి.

న్యాయం చెప్పాలంటే దోమతెర దోమలకు కూడా ఒకప్పుడు ప్రమాదమే. అది ఒక్కసారి దోమలకు బోనులాగా అయిపోతుంది. మనం దోమతెరని ఎంతజాగ్రత్తగా పక్కకిందకిదోపేసినా, ఏరాత్రివేళో నిద్రలో పొర్లి దోమతెర అంచు లేపేస్తాం. వెంటనే దోమలు లోపలికి రావటానికి సందుఏర్పడుతుంది. అందులో నుంచి దోమలమందలు శ్రీశ్రీ గేయం పాడుకుంటూ తోసుకుని లోపలి కొచ్చేస్తాయి. లోపల వాటికి మహా వెచ్చగా, సౌకర్యంగా ఉంటుంది. తాగటానికి అమృత భాండంలా మనిషి ఉంటాడు. ఒళ్ళు పై తెలియకుండా అన్నీ తాగేస్తాయి. వాటికి కైపెక్కి, తలతిరిగి పోతుంది. వచ్చిన దారి మరిచి పోతాయి, ఇంతలో ఒళ్ళంతా చురుక్కుంటూ అమృతభాండం లేచికూచుంటుంది. పాపం దోమలు పారిపోలేక, దోమతెరలో చిక్కుకుపోయి, వీరమరణం పాలవుతాయి... ఒకనాడు రాత్రి నేను నా దోమతెరలో రెండువేల చిల్లర దోమలను చంపాను. అంత భారీగా జీవహింసచేసే అవకాశం నాకు మళ్ళీ లభించదు. అది నాజన్మకు అన్నివిధాలా శివరాత్రి, ఆ లేచిన లేవటం తెల్లవారినదాకా జాగారం చేశాను.

నా కింకొక అనుమానం కూడా ఉంది- దోమలు విధి యొక్క ఏజెంట్లని. మానవ పాపులను హింసించడానికీ, మతులు పోగొట్టటానికీ, తప్పుడు రాతలు రానేవాళ్ళకు అంత రాయాలు కలిగించడానికీ, రోగాలు తెప్పించటానికీ బ్రహ్మదేవుడు వీటిని సృష్టించి పంపిస్తాడేమో. మిగిలిన ఏ విషయంలోనైనా నేను నాస్తికత్వం ఒప్పుకుంటాను కాని దోమల విషయంలో నేను ఏ మూఢ విశ్వాసమైనా అవలంబించటానికీ ప్రచారం చెయ్యటానికి సిద్ధంగా వున్నాను. ●